## అలాంటి వార్తలపై నయన మండిపాటు

# అలాంటి ప్రయత్నం చేయలేదు : నయనతార





హీరోయిన్లు తాము చేసే సినిమాల గురించే కాకుండా ఇతర విషయాలపైనా వార్తల్లో నిలుస్తుంటారు. అందులో వారి ప్రమేయం ఉండొచ్చు ఉండకపోవచ్చు. ఒక్కోసారి ఏ సంబంధం లేకుండానే వార్తలకెక్కుతారు. తాజాగా అలాంటి వార్తలపై నయనతార మండిపడ్డారు. తాను ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నట్లు గతంలో వచ్చిన వార్తలను ఆమె ఖండించారు. దేవుడు ఇచ్చిన తన ముఖాన్ని మార్చుకోవాలని ఎప్పుడూ ప్రయత్నించలేదని, ఆ ఆలోచన కూడా రాలేదని తెగేసి చెప్పారు. నయన్ ఇండస్ట్రీ లో అడుగుపెట్టిన కొన్నాళ్ల తర్వాత పలు చిత్రాల్లో ఆమె ముఖం తొలి సినిమాలో కంటే సన్నగా కనిపించింది. దీంతో ఆమె ప్లాస్టిక్ సర్జరీ చేయించుకున్నారనే రూమర్స్ మొదలయ్యాయి. తాజాగా నయనతార వాటికి ఫుల్‌స్టాప్ పెట్టారు. ఆదివారం ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె దీనిపై మాట్లాడారు. "నా కనుబొమ్మలు అంటే నాకు చాలా ఇష్టం. వాటి ఆకారం ఎప్పుడూ మారుస్తూ ఉంటాను. ప్రతి రెడ్ కార్పెట్ ఈవెంట్లకు ముందు వాటిని మార్చుతుంటాను. వాటి కోసం ఎంతో సమయాన్ని కేటాయిస్తాను. కనుబొమ్మల ఆకారం మారినప్పుడల్లా ముఖంలో మార్పు కనిపిస్తుంది. బహుశా అందుకే నా ముఖంలో మార్పులు వచ్చాయని ప్రజలు అనుకొని ఉంటారు. వాళ్లు అనుకున్నది నిజం కాదు.. అలాగే డైటింగ్ వల్ల కూడా నా ముఖంలో మార్పులు రావచ్చు. ఒక్కోసారి బుగ్గలు వచ్చినట్లు కనిపిస్తుంటాయి. ఇంకోసారి అవి లోపలికి వెళ్లినట్లు అనిపిస్తుంటుంది. కావాలంటే మీరు నన్ను గిచ్చి చూడొచ్చు.. నా శరీరంలో ఎక్కడా ప్లాస్టిక్ ఉండదు" అని నయనతార అన్నారు. ప్రస్తుతం ఆమె కోలీవుడ్‌తోపాటు బాలీవుడ్‌లోనూ బిజీ అయ్యారు. గతేడాది 3 సినిమాలతో అలరించిన నయన్ ప్రస్తుతం ఐదు సినిమాలతో బిజీగా ఉన్నారు.

# ఖలేజా గురించి మాట్లాడితే

## గొడవపడేవాడిని : విజయ్ దేవరకొండ



మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం లక్కీ భాస్కర్. గత ఏడాది 'సార్' సినిమాతో బ్లాక్ బస్టర్ అందుకున్న వెంకీ అట్లూరి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుంది. ఈ సినిమా దీపావళి కానుకగా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే మూవీ నుంచి ట్రైలర్‌తో పాటు పాటలు విడుదల చేయగా.. ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తుంది. ఇదిలావుంటే తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో గ్రాండ్‌గా నిర్వహించారు మేకర్స్. ఇక ఈ ప్రీ రిలీజ్ వేడుకకు ముఖ్య అతిథులుగా రౌడి హీరో విజయ్ దేవరకొండతో పాటు మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ వచ్చి సందడి చేశారు. అయితే ఈ వేడుకలో విజయ్ మాట్లాడుతూ.. తనకు సితార ఎంటర్‌టైనమెంట్స్‌తో మంచి అనుభందం ఉందని విజయ్ తెలిపాడు. పెళ్లి చూపులు మూవీ విజయం సాధించిన తర్వాత నా ఫస్ట్ చెక్ సితార ఎంటర్‌టైనమెంట్స్ నుంచి అందుకున్నాను. త్రివిక్రమ్ గారు నన్ను ఆఫీస్‌లో కుర్చోబెట్టి నా ఫస్ట్ చెక్ ఇప్పించారు. ఇది జరిగి 7 ఏండ్లు అవుతుంది. సితార అప్పుడు చెక్ ఇస్తే.. ఇన్ని సంవత్సరాలు పట్టింది సినిమా చేయడానికి. ఇప్పుడు మేం కలిసి వీడీ12 చేస్తున్నాం. త్రివిక్రమ్ సర్‌ని ఫస్ట్ టైం కలవడం నా లైఫ్‌లో మర్చిపోలేని క్షణం. నా పర్సనల్ ఫేవరెట్ చిత్రాలు అతడు, ఖలేజా. ఖలేజా సినిమా అయితే ఎవడైనా నచ్చలేదు అంటే నేను వాడితో గొడవ పడే వాడిని అంటూ విజయ్ చెప్పుకొచ్చాడు. అలాంటి మనిషి నాకు చెక్ ఇచ్చి నువ్వు స్టార్ అవుతావు అంటూ చెప్పాడు. ఎవరు సినిమాలు చూస్తూ పెరిగామో ఆ వ్యక్తి మనల్ని స్టార్ట్ అవుతారు అని చెప్పినప్పుడు చాలా ఆనందం వేసింది అంటూ విజయ్ చెప్పుకోచ్చాడు. కాగా ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

## భారీ క్యూ ఉంది.. ఏదీ ఫైనల్ చేస్తారో

# చిరంజీవి ఒకే కోసం దర్శకుల ఎదురుచూపులు

చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' చిత్రీకరణ తుదిదశలో ఉంది. సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రావలసింది కానీ పలు కారణాలతో వెనక్కి వెళ్లింది. ఈ చిత్రం తర్వాత చిరంజీవి తదుపరి చిత్రం ఏంటనేది ఇప్పుడు చర్చ. ఈ విషయంపై చిరంజీవి కూడా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. 'విశ్వంభర' సంక్రాంతి తర్వాత విడుదల కాబట్టి చిరంజీవి కూడా నెక్ట్స్ ఏంటి అనే విషయంలో కూల్‌గా ఉన్నారు. అయితే ఆయనతో సినిమా కోసం పలు దర్శకులు, రచయితలు వాళ్ల పనులతో బిజీగా ఉన్నారు. చిరు సిగ్నల్ ఇస్తే సెట్స్ మీదకు వెళ్లడానికి కంగారుగా ఉన్నారు. రచయిత, దర్శకుడు బీవీఎస్ రవి చిరంజీవికి ఓ కథ చెప్పారు. అయితే దర్శకుడు మాత్రం ఆయన కాదు. మోహన్ రాజాతో కలిసి ఆయన వర్క్ చేస్తున్నారు. కథ దాదాపుగా సిద్ధమైంది. చిరు 'ఓకే' అంటే ప్రాజెక్ట్ సెట్ అయిపోయినట్లే. చిరంజీవి కోసం బీవీఎస్ రవి ఓ సామాజిక సందేశం నిండిన కథ రాశారట. 'ఠాగూర్' తరహా సినిమా అని, బలమైన సందేశంతో పాటు, కమర్షియల్ హంగులన్నీ ఉంటాయని తెలుస్తోంది. ఇదే విషయంపై బీవీఎస్ రవి కూడా ఓ స్టేట్‌మెంట్ ఇచ్చారు. "చిరంజీవి అంటే, పాటలు డాన్సులు గుర్తొస్తాయి. ఆ తరహా చిత్రాలు ఆయనే ఎన్నో చేశారు. అలాగే సందేశాత్మక చిత్రాలు చేశారు. వాటిని ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు. ఓ పెద్ద స్టార్ బలమైన సందేశాన్ని ఇస్తే , చాలామందికి చేరువ అవుతుందని, తాను అలాంటి కథే సిద్ధం చేశానని చెప్పుకొచ్చారు బీవీఎస్ రవి. 'విశ్వంభర' తమ సినిమానే మొదలవుతుందని కూడా చెప్పారు. గతంలో కల్యాణ్ కృష్ణ కురసాల దర్శకత్వంలో ఓ సినిమా అనుకున్నారు. అది పట్టాలెక్కలేదు. అది కూడా క్యూలో ఉందా లేదా అనేది చూడాలి. హరీష్ శంకర్ కూడా ఒక సినిమా చేయాలనే ఆలోచనలో ఉన్నారు. 'విశ్వంభర' తరవాత ఏ సినిమా చేయాలన్న విషయంలో చిరంజీవి ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. బీవీఎస్ రవి కథ కూడా లైన్ లో ఉందని, అయితే చిరు అంగీకారం తెలపాలని అంటున్నారు.

# సాయి పల్లవి అంటే.. సాయి పల్లవే ఆమె నటనకు ఫిదా...








నేచురల్ బ్యూటీ సాయి పల్లవి, శివకార్తికేయన్ జంటగా విశ్వనటుడు కమల్ హాసన్ నిర్మిస్తున్న సినిమా అమరన్. ఈ సినిమా దీపావళి కానుకగా పలు భాషల్లో అక్టోబర్ 31న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలోనే చిత్ర యూనిట్ ప్రమోషన్స్‌లో జోరు పెంచింది. కానీ.. సాయి పల్లవి ప్రమోషన్స్ అటెండ్ కాకుండా చేసిన పని చూస్తే మీరు గ్రేట్ అనాల్సిందే.. ఇంతకీ సాయి పల్లవి ప్రమోషన్స్‌కి ఎందుకు అటెండ్ కావడం లేదు.. ఇంతకీ సాయి పల్లవి ఎం చేశారంటే.. అమరన్.. ఈ సినిమాని కాశ్మీర్ నేపథ్యంలో శివ్ అరూర్, రాహుల్ సింగ్ రాసిన ఆర్మీ మేజర్ ముకుంద్ వరదరాజన్ జీవిత సంఘటనలతో రాసిన 'ఇండియాస్ మోస్ట్ ఫియర్‌లెస్ : ట్రూ స్టోరీస్ ఆఫ్ మోడరన్ మిలిటరీ' పుస్తకం ఆధారంగా యాక్షన్ ఎమోషనల్ డ్రామాగా తెరకెక్కిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే సాయి పల్లవి తన సోషల్ మీడియా ఖాతాలో ఆసక్తికర సందేశాన్ని పోస్ట్ చేశారు. "అమరన్ కోసం ప్రమోషన్‌లను ప్రారంభించే ముందు నేను నేషనల్ వార్ మెమోరియల్‌ని సందర్శించాలనుకున్నాను. ఈ పవిత్రమైన ఆలయంలో, మన కోసం తమ ప్రాణాలను అర్పించిన ప్రతి బ్రేవ్‌హార్ట్ జ్ఞాపకార్థం వేలకొద్దీ 'ఇటుక లాంటి పలకలు' ఉన్నాయి. మేజర్ ముకుంద్ వరదరాజన్, సిపాయి విక్రమ్ సింగ్ లకు నివాళ్లు తెలుపుతున్నపుడు నా ఒళ్ళు పులకరించి పోయింది" అంటూ పోస్ట్ చేశారు. దీంతో అందరు సాయి పల్లవి గెస్చర్ కి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# దళపతి విజయ్ పొలిటికల్ ఎంట్రీపై స్పందించిన పవన్



కోలీవుడ్ స్టార్ దళపతి విజయ్ పొలిటికల్ ఎంట్రీపై నటుడు, జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రియాక్టయ్యారు. ఆయనతో పాటు విలక్షణ నటుడు ప్రకాష్ రాజ్ కూడా తనదైన స్టైల్‌లో రెస్పాండ్ అయ్యారు. బీజేపీ, డీఎంకే సిద్ధాంతాలకు వ్యతిరేఖంగా ఏర్పాటు చేసిన తమిళగ వెట్రి కళగం పార్టీ అధినేతకు పవన్, ప్రకాష్ ఎం చెప్పారంటే.. "నాకు రాజకీయ అనుభవం లేకపోవచ్చు. కానీ, నేను పాలిటిక్స్ విషయంలో భయపడడం లేదు" అంటూ విజయ్ ఆదివారం తన పార్టీ తొలి మహానాడులో మాట్లాడారు. ఈ నేపథ్యంలోనే దేశ నలుమూలల నుండి సినీ, రాజకీయ ప్రముఖులు విజయ్‌కి అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తన సోషల్ మీడియా అకౌంట్ ద్వారా అభినందనలు తెలిపారు. పవన్ తన పోస్ట్‌లో " సిద్దులు, సాధువులకు నిలయమైన తమిళనాడులో తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన విజయ్ కి నా హృదయపూర్వక అభినందనలు" అంటూ పోస్ట్ చేశారు.